సాక్షి చిత్తూరు

శనివారం । 26 । ఏప్రిల్ । 2025



డైయింగ్ ప్లాంట్లు తరలించాల్సిందే

డైయింగ్ యూనిట్లు నివాసాలకు దూరంగా తరలించాల్సిందేనని నగరి మున్సిపల్ కౌన్సిలర్లు రోడ్డెక్కారు.
- 10లో



వైభవంగా ఉరుసు ప్రారంభం

పుంగనూరు చెరువు కట్టపై ఉన్న హజరత్ సయ్యద్ నూర్‌షావలి బాబా దర్గా ఉరుసు వైభవంగా ప్రారంభమైంది.
- 10లో



మూడు టిప్పర్ల సీజ్..

తమిళనాడుకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు టిప్పర్లను సీజ్ చేసి, నలుగురిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.
- 10లో

న్యూస్‌రీల్

29న జెడ్పీ సర్వసభ్య సమావేశం

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లా జెడ్పీ సర్వసభ్య సమావేశం 29న మంగళవారం నిర్వహించనున్నారు. ఉదయం 10.30 గంటలకు జెడ్పీ సమావేశ మందిరంలో కార్యక్రమం ప్రారంభమవుతుందని చైర్మన్ శ్రీనివాసులు, సీఈఓ రవికుమార్‌నాయుడు తెలిపారు. అజెండాలోని అంశాలైన వ్యవసాయం, ఉద్యాన, విద్య, వైద్య, గృహ నిర్మాణ, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్, పంచాయతీరాజ్, డ్వామా, డీఆర్‌డీఏ, అంగన్‌వాడీశాఖల పరంగా చర్చ జరుగుతుందన్నారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు హాజరవుతారన్నారు. సంబంధిత జిల్లా అధికారులు సమగ్ర సమాచారంతో కార్యక్రమానికి రావాలని తెలిపారు.

పకడ్బందీగా ఏపీఆర్ఎస్ క్యాట్ పరీక్షలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలో శుక్రవారం ఏపీఆర్ఎస్ క్యాట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించినట్లు డీఈఓ వరలక్ష్మి వెల్లడించారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని నాలుగు కేంద్రాల్లో పరీక్షలను పకడ్బందీగా నిర్వహించామన్నారు. ఈ పరీక్షలకు 756 మంది విద్యార్థులకుగాను 562 మంది హాజరుకాగా 194 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. అలాగే మధ్యాహ్నం నిర్వహించిన ఏపీఆర్‌జేసీ, డీసీ సెట్ పరీక్షలు ఐదు పరీక్ష కేంద్రాల్లో నిర్వహించామన్నారు. ఈ పరీక్షలకు 1,082 మంది విద్యార్థులకుగాను 908 మంది హాజరుకాగా 174 మంది గైర్హాజరైనట్లు డీఈఓ వెల్లడించారు.

పాలిసెట్‌కు ఒక్క నిమిషం నిబంధన

కుప్పంరూరల్ : పాలిసెట్‌కు అభ్యర్థులు ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా పరీక్ష కేంద్రంలోకి అనుమతించమని పాలిసెట్ జిల్లా కన్వీనర్ జగన్నాథరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 30న కుప్పంలో రెండు, పలమనేరులో ఐదు కేంద్రాల్లో పాలిసెట్ నిర్వహించనున్నట్లు చెప్పారు. మొత్తం 2,206 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష ఉంటుందని వెల్లడించారు. ఆన్‌లైన్ ద్వారా హాల్‌టికెట్ రాని వారు, దరఖాస్తు చేసుకున్న స్లిప్, రూ.400, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో సమీపంలోని పాలిటెక్నిక్‌కు వెళ్లి పరీక్ష రాయవచ్చని సూచించారు.

పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో నేడు వరల్డ్ వెటర్నరీ డే

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో శనివారం వరల్డ్ వెటర్నరీ డే నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి అరిఫ్ తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ఏపీఎల్‌డీఏ సీఈఓ శ్రీనివాసరావు ముఖ్య అతిథి హాజరుకానున్నారని చెప్పారు. ఉత్తమ పశు వైద్యులు, సిబ్బంది, విశ్రాంత ఉద్యోగులను సత్కరిస్తామన్నారు. ముందుగా శాఖ అధికారులతో సమీక్ష జరుగుతుందని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ కమిటీలో మరి కొందరికి చోటు

చిత్తూరు అర్బన్/తిరుపతి మంగళం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీలో తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని పలువురు నాయకులకు చోటు లభించింది. అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం రాష్ట్ర కమిటీలో పలువురికి అవకాశం కల్పిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర పబ్లిసిటీ విభాగ కార్యదర్శులుగా గంగాధర నెల్లూరు నియోజవర్గానికి చెందిన మధుసూదన్‌రెడ్డి, కుప్పానికి చెందిన కె.మోహన్, నగరికి చెందిన కేవీ చంద్రశేఖర్, పుంగనూరుకు చెందిన ఎ.నారాయణ్‌రెడ్డి, తిరుపతి జిల్లాకు చెందిన దశరథరామిరెడ్డిని నియమించింది. రాష్ట్ర పబ్లిసిటీ విభాగ సంయుక్త కార్యదర్శిగా పూతలపట్టుకు చెందిన దేవేంద్రరెడ్డి, స్టేట్ గ్రీవెన్స్ సెల్ కార్యదర్శిగా సత్యవేడు సాయినాయుడు, తిరుపతి జిల్లాకు చెందిన ఎం.ఆదిశేషగిరిరావును నియమించింది. స్టేట్ గ్రీవెన్స్ సెల్ సహాయ కార్యదర్శులుగా గంగాధర నెల్లూరుకు చెందిన ఉమా చంద్రన్ రెడ్డి, కుప్పానికి చెందిన కుందన నాథన్ రెడ్డి, శ్రీకాళహస్తికి చెందిన అంకయ్య, తిరుపతి జిల్లాకు చెందిన దేశిరెడ్డి మధుసూదన్‌రెడ్డిని నియమించినట్లు పేర్కొంది. అలాగే తిరుపతికి చెందిన ఐ.చంద్రశేఖర్‌రెడ్డిని తిరుపతి జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ పెరిగింది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 58,227 మంది స్వామిని దర్శించుకున్నారు. 28,951 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.88 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 18 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. కాగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

కుప్పం మున్సిపల్ చైర్మన్.. ఈ పదవికి కావాల్సిన బలం కూటమి పార్టీలకు లేదు..అయితేనేం.. అధికార బలం ఉంది.. ఆ బలుపు కనబరిచి.. ప్రలోభాల ఎర చూపి.. ఎత్తులు, జిత్తులు వేసి.. ఎలాగైనా చైర్మన్ గిరిని దక్కించుకోవాలని యత్నిస్తున్నారు. ఇందుకు బెంగళూరు కేంద్రంగా క్యాంపు రాజకీయాలకు తెర లేపారు. ప్రతిపక్ష పార్టీ కౌన్సిలర్ల ఇళ్లకు వెళ్లి నగదు ఆశ చూపి.. దానికి లొంగకుంటే బెదిరింపులకు పాల్పడుతున్నారు కూటమి నేతలు.



బలుపు కనబరి-చి

ప్రలోభాలు ఎరవేసి..

28న కుప్పం మున్సిపల్ చైర్మన్ ఎన్నిక

- బలం లేకపోయినా నెగ్గేందుకు సిద్ధమవుతున్న టీడీపీ
- ఎలాగైనా చైర్మన్ పదవి దక్కించుకోవాలని ప్రలోభాలు
- మొదలైన ఇరుపార్టీల క్యాంపు రాజకీయాలు, రహస్య సమావేశాలు
- కుప్పంలో హాట్‌టాపిక్‌గా మారిన చైర్మన్ ఎన్నిక



కుప్పం మున్సిపాలిటీ కార్యాలయం

కుప్పంరూరల్: స్థానిక మున్సిపల్ చైర్మన్ పదవికి కావాల్సిన బలం లేకపోయినా అధికార బలం కనబరిచి ఆ పదవి దక్కించుకోవాలని కూటమి యత్నిస్తోంది. కూటమి ప్రభుత్వం రాగానే అప్పటి వరకు ఉన్న కుప్పం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ అనివార్య కారణాలతో రాజీనామా చేయాల్సి వచ్చింది. దీంతో కుప్పం మున్సిపల్ చైర్మన్ పదవి 2024 నవంబరు 5వ తేదీ నుంచి ఖాళీగా ఉంది. చైర్మన్ ఎన్నిక కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం మిగిలిన తుని, పాలకొండలతో పాటు కుప్పం మున్సిపాలిటికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 28వ తేదీన ఎన్నికకు ముహూర్తం ఖరారు చేసింది. దీంతో అధికార, ప్రతిపక్ష పార్టీల్లో ఒక్కసారిగా ఎన్నికల వేడి రగిలింది. బలం లేకపోయినా ఎలాగైన అధికారాన్ని అడ్డం పెట్టుకుని చైర్మన్ గిరి దక్కించుకోవాలని టీడీపీ సర్వశక్తులు ఒడ్డుతోంది.

ఎన్నికలు ఇలా...

సంఖ్యాపరంగా చూసుకుంటే వైఎస్సార్‌సీపీకి 15, టీడీపీకి 12 ఓట్లు ఉన్నాయి. మొత్తం 27 మంది సభ్యుల్లో 14 మంది ఎన్నికకు హాజరైతే కోరంగా పరిగణించి, ఎన్నికలు నిర్వహిస్తారు. హాజరైన అభ్యర్థుల్లో ఎక్కువ మంది ఎవరికి చేతులెత్తి మద్దతు తెలుపుతారో వారు చైర్మన్ అభ్యర్థిగా పరిగణిస్తారు.

బెంగళూరు కేంద్రంగా క్యాంపు రాజకీయాలు

కుప్పం మున్సిపాలిటీ ఎన్నికలు 28న జరగనున్న నేపథ్యంలో నాలుగు రోజులు ముందుగా వైఎస్సార్ సీపీ, టీడీపీ అధిష్టానాలు కౌన్సిలర్లను బెంగళూరు తరలించి క్యాంపు రాజకీయాలకు తెరలేపింది. ఎవరికి వారు తమ అభ్యర్థులు జారీపోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కౌన్సిలర్ల ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసి క్యాంపునకు తరలించారు. అక్కడ అన్ని రకాల సదుయాలు కల్పించి కౌన్సిలర్లు జారిపోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

అందరి దృష్టి సోమవారంపైనే...

కుప్పం మున్సిపాలిటీలోని ప్రజల దృష్టి సోమవారంపైనే నిలిచింది. ఎవరు మున్సిపాలిటీ చైర్మన్ అవుతారో అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఎన్నిక జరుగుతుందా..? జరిగితే ఎవరు గెలుస్తారు..? అధికార పార్టీ తమ అధిపత్యాన్ని నిలుపుకునేందుకు ఎలాంటి కుతంత్రాలు పన్నుతోంది..? అనే విషయాలపై ప్రజల దృష్టి నిలిచింది. ఏది ఏమైనప్పటికీ సుమారు 56 వేల జనాభా ఉన్న కుప్పం ప్రజల చూపు సోమవారంపైనే నిలిచింది.

కుప్పం మున్సిపాలిటీ సమాచారం

మొత్తం వార్డులు -	25
ఎన్నికల్లో పాల్గొంటున్న వార్డు సభ్యులు -	24
ఎక్స్ అఫిసియో సభ్యులు -	3
మొత్తం జనాభా -	48,532 (2011 లెక్కల ప్రకారం)
మొత్తం ఓటర్లు -	39,319
పురుష ఓటర్లు -	18,838
మహిళా ఓటర్లు -	20,473
ట్రాన్స్‌జెండర్లు -	8

ప్రలోభాల బాటలో టీడీపీ..

సంఖ్యాపరంగా వైఎస్సార్ సీపీ గెలుపొందడం ఖాయం. కానీ అధికార టీడీపీ ఎలాగైనా కుప్పం మున్సిపాలిటీ చైర్మన్ అభ్యర్థిత్వాన్ని దక్కించుకోవాలనే ఉద్దేశంతో వైఎస్సార్ సీపీ సభ్యులను ప్రలోభాలకు గురిచేస్తోంది. నయానో భయానో ఎలాగైన వారిని వశపరుచుకోవాలని శతవిధాలా ప్రయత్నాలు చేస్తున్నారు. కౌన్సిలర్లు క్యాంపులో ఉండడంతో ఇళ్ల వద్దకు వెళ్లి కుటుంబ సభ్యులకు డబ్బు ఆశ చూపి, బోల్తా కొట్టించే యత్నాలు చేస్తున్నారు. టీడీపీకి మద్దతుగా నిలవకపోతే కేసులు బనాయిస్తామని, ఆర్థిక లావాదేవీలను దెబ్బతీస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారు.

ఆశావహుల్లో గుబులు...

వైఎస్సార్ సీపీ చైర్మన్ అభ్యర్థి ఎవరనే విషయం కౌన్సిలర్లకు అధిష్టానం ఇప్పటికే స్పష్టం చేసిన దృష్ట్యా అందరు ఏకతాటిపై ఉన్నారు. అధికార పార్టీ టీడీపీలో మాత్రం అలజడి నెలకొంది. ముఖ్యంగా 19వ వార్డు కౌన్సిలర్ జిమ్ దాము, 20వ వార్డు కౌన్సిలర్ సోమశేఖర్, 5వ వార్డు కౌన్సిలర్ సెల్వం చైర్మన్ రేసులో ఉన్నారు. వీరు ముగ్గురు తమకంటే తమకే అధిష్టానం ఆశీర్వాదం ఉన్నట్లు ప్రచారం చేసుకుంటున్నారు. తమ పార్టీ వారే కాకుండా ఎదుట పార్టీ వారిని ఫోన్ల ద్వారా పలకరిస్తూ తమకే మద్దతుగా నిలవాలని ఆశావాహుల్లో ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నారు.

కుప్పం మున్సిపాలిటీలో ప్రస్తుత బలాబలాలు..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పులివెందుల నియోజక వర్గంతో పాటు ప్రతిపక్ష నాయకుడి నియోజక వర్గమైన కుప్పంపై వివక్ష చూపకుండా ఈ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుక్లెందుకు కృషి చేశారు. ఇందులో భాగంగానే కుప్పానికి రెవెన్యూ, పోలీసు డివిజన్లు వచ్చాయి. కుప్పం పట్టణాన్ని ఆరు పంచాయతీలతో కలిపి మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేశారు. ఈ క్రమంలో కుప్పం మున్సిపాలిటీకి 2021 నంబర్ 15వ తేదీన ఎన్నికలు నిర్వహించారు. పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన వైఎస్సార్ సీపీకి ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారు. మున్సిపాలిటీలో 25 వార్డులకుగాను వైఎస్సార్ సీపీ అభ్యర్థులు 19 మంది, టీడీపీ అభ్యర్థులు 6 గెలుపొందారు. వైఎస్సార్ సీపీ సభ్యులు అధిష్టానం అభీష్టం మేరకు డాక్టర్ సుధీర్‌ను చైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఆయన నాయకత్వంలో మున్సిపాలిటీలో అభివృద్ధి పరుగులు తీసింది. గత ఏడాది జూన్ 4వ తేదీన కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మున్సిపాలిటీలో కుదుపు మొదలైంది. కూటమి నాయకులు, ప్రభుత్వం నుంచి వైఎస్సార్ సీపీ సభ్యులపై రకరకాల ఒత్తిళ్లు మొదలయ్యాయి. మొదటి వికెట్‌గా 2024 నంబర్ 5వ తేదీన చైర్మన్ డాక్టర్ సుధీర్ చైర్మన్ పదవితోపాటు, 16వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిత్వానికి రాజీనామా చేసి, టీడీపీలోకి వెళ్లిపోయారు. దీంతో 16 వవార్డు కౌన్సిలర్ ఖాళీ కాగా, మొత్తం కౌన్సిలర్ల సంఖ్య 24కు చేరింది. ఆయన బాటలోనే మరో ఐదుగురు కౌన్సిలర్లు టీడీపీలోకి వెళ్లిపోయారు. వెళ్లిన వారిలో 24వ వార్డు కౌన్సిలర్ సయ్యద్ ఆలీ తిరిగి వైఎస్సార్‌సీపీలోకి వచ్చారు. ఈ పరిణామంతో మున్సిపాలిటీలో వైఎస్సార్ సీపీకి 14, టీడీపీకి 10 మంది కౌన్సిలర్లు ఉన్నారు. వీరే కాకుండా ఎక్స్ అఫిషియో సభ్యులు స్థానిక ఎమ్మెల్యే చంద్రబాబు, పట్టభద్రుల ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ భరత్ మున్సిపాలిటీ ఓటర్లుగా ఉన్నారు. వీరిని కలుపుకుంటే వైఎస్సార్ సీపీకి 15, టీడీపీ 12గా సమీకరణలు మారాయి.

కుప్పంలో 144 సెక్షన్ అమలు

కుప్పం: మున్సిపల్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా కుప్పం మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు ఆర్డీఓ శ్రీనివాసులరాజు తెలిపారు. ఈ నెల 28వ తేదీన మున్సిపాలిటీ చైర్మన్ ఎన్నిక జరగనుండడంతో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా 144 సెక్షన్‌ను అమలు చేస్తున్నట్లు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో చైర్మన్ ఎన్నిక నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యాలయం వంద మీటర్ల దూరంలో పూర్తి స్థాయిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

మెగా మెలిక.. అంతా తికమక



- టెట్ ఉత్తీర్ణత సాధించినా డీఎస్సీ అర్హత కఠినతరం
- పది, ఇంటర్‌లో 50 శాతం అర్హత అవసరమా!
- ఇంటర్ తప్పి తిరిగి 35 శాతంతో పాసైన వారు ఐఏఎస్‌లు కాలేదా?
- సివిల్స్‌కు లేని నిబంధనలు డీఎస్సీకి ఎందుకు?
- ఇది కుట్రలో భాగమే అంటున్న నిరుద్యోగులు
- మండిపడుతున్న విద్యార్థి సంఘాలు, డీఎస్సీ అభ్యర్థులు

తిరుపతి సిటీ: ప్రభుత్వం విడుదల చేసిన మెగా డీఎస్సీ నోటిఫికేషన్ వివాదాలకు తావిస్తోంది. డీఎస్సీకి దరఖాస్తు చేయాలంటేనే అభ్యర్థులు వణికిపోతున్నారు. ఆన్‌లైన్ అగచాట్లు తలబొప్పి కట్టిస్తుండగా.. అర్హత నిబంధనలు తికమకపట్టిస్తున్నాయి. పది, ఇంటర్‌లో 40 నుంచి 50శాతం మార్కులు సాధించి ఉండాలని, అలాగే డిగ్రీలో 50శాతం, పీజీలో 55 శాతం తప్పనిసరి చేయడంతో అభ్యర్థులు అయోమయంలో పడ్డారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 5 శాతం వెసులుబాటు కల్పించారు. గతంలో జరిగిన డీఎస్సీలో ఇలాంటి కఠిన నిబంధనలు లేవని, కొత్తగా పది, ఇంటర్, డిగ్రీ మార్కుల అర్హతలను ప్రామాణికం చేయడంలో ఆంతర్యమేమిటో అర్థం కావడంలేదని డీఎస్సీ అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇది కుట్రలో భాగమేనా?

సివిల్స్ సర్వీసుకు సైతం ఎలాంటి నిబంధనలు లేవు. పది, ఇంటర్‌లో సప్లమెంటరీ పరీక్షలు రాసి 35 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన ఎంతో మంది సివిల్స్ సాధించారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులయ్యారు. అలాంటిది టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించినా పది, ఇంటర్, డిగ్రీల పర్సెంటేజ్‌పై నిబంధనలు పెట్టడం విమర్శలకు తావిస్తోంది. డీఎస్సీని సజావుగా జరపకూడదనే కుట్రతోనే ప్రభుత్వం మెలికలతో కూడిన డీఎస్సీని విడుదల చేసిందని నిరుద్యోగులు, విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి.

ఉమ్మడి చిత్తూరు జిల్లా సమాచారం

ప్రాథమిక పాఠశాలలు -	3,766
ప్రాథమికోన్నత పాఠశాలలు -	445
ఉన్నత పాఠశాలలు -	705
ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు-	సుమారు 6,245
ప్రస్తుతం భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇచ్చిన పోస్టులు -	1,478
పోటీపడనున్న అభ్యర్థులు -	72 వేల మంది
అర్హత మెలికతో డీఎస్సీకి దూరం కానున్న అభ్యర్థులు-	సుమారు 14వేల మంది

మా పరిస్థితి అగమ్యగోచరమే



పదో తరగతిలో 40 శాతం వచ్చాయి. ఆరోగ్యం సరిలేకపోవడంతో ఇంటర్‌లో 39.5 శాతంతో పాసయ్యా. డిగ్రీ 47 శాతం వచ్చాయి. పీజీ 60 శాతం ఉంది. బీఈడీ పూర్తి చేసి టెట్‌లో ఉత్తీర్ణత సాధించాను. నోటిఫికేషన్ వచ్చిందని సంతోషపడ్డా. కానీ అర్హతల విషయంలో ప్రభుత్వం మెలిక పెట్టడంతో ఆశలు ఆవిరైపోతున్నాయి. లక్షలు వెచ్చించి కోచింగ్ తీసుకున్నా. గతంలో డీఎస్సీకి ఉన్న అర్హతలనే కొనసాగించాలి.

– చంద్రశేఖర్, డీఎస్సీ అభ్యర్థి, తిరుపతి రూరల్

ఆశలపై నీళ్లు చల్లవద్దు



టీచర్ కావాలన్న లక్ష్యం డీఎస్సీకి కొన్ని ఏళ్లుగా సన్నద్ధమవుతున్నా. అర్హత మార్కులంటూ మెలిక పెట్టడం దారుణం. పది, ఇంటర్‌లో 55 శాతానికిపైగా మార్కులు వచ్చాయి. కానీ డిగ్రీలో 48 శాతం మాత్రమే వచ్చాయి. టెట్ అర్హత సాధించా. డిగ్రీలో 50శాతం అనే నిబంధన బాధకలిగిస్తోంది. గతంలో లేని కఠిన నిబంధనలు ఇప్పుడు ఎందుకు పెడుతున్నారో, అందులో ఆంతర్యమేమిటో అర్థం కాలేదు. మాలాంటి వారి ఆశలపై నీళ్లు చల్లద్దు.

– సుకన్య, డీఎస్సీ అభ్యర్థి, తిరుపతి

అప్పుడు లేని నిబంధనలు ఇప్పుడెందుకో?



డీఎస్సీకి గతంలో ఇలాంటి కఠిన నిబంధనలు లేవు. డీఎస్సీకి టెట్ పరీక్ష ప్రామాణికంగా ఉండేది. కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ వదిలిందన్న సంతోషం ఆవిరైపోయింది. అర్హతల విషయంలో వెంటనే ప్రభుత్వం స్పందించాలి. గతంలో డీఎస్సీ అర్హతలనే కొనసాగిస్తూ రీ నోటిఫికేషన్ ఇవ్వాలి. ఇంటర్, డిగ్రీ, పీజీలలో 50శాతం దాటని మాలాంటి ఓసీ అభ్యర్థులు వందల మంది అనర్హులుగా మిగిలిపోతారు.

– ప్రసన్నలక్ష్మి, డీఎస్సీ అభ్యర్థి, శ్రీకాళహస్తి

అంతా అయోమయం



డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారన్న సంతోషం లేదు. అర్హతలలో మెలిక పెట్టేశారు. అన్ని అర్హతలు ఉన్న సర్టిఫికెట్లను దరఖాస్తు చేసుకునే సమయంలోనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని నిబంధన పెట్టారు. అంతా అయోమయంగా ఉంది. 90 శాతం మంది అభ్యర్థులు ఇంటా ధ్రువపత్రాల వేటలో ఉన్నారు. మార్కుల జాబితాతో పాటు, కుల, ఆదాయ ధ్రువపత్రాలను సైతం తీసుకోవడానికి సమయం తక్కువ. అభ్యర్థులు టెన్షన్ పడుతున్నారు. నిబంధనలను సడలించాలి.

– హరిత, డీఎస్సీ అభ్యర్థి, తిరుపతి

అస్తవ్యస్తంగా ఉంది



కూటమి ప్రభుత్వం కుట్రలో భాగంగానే మెగా డీఎస్సీ విడుదల చేసిందనిపిస్తోంది. డీఎస్సీకి గతంలో ఎన్నడూ లేని నిబంధనలు విధించారు. గతంలో ఏ డీఎస్సీలోనూ ఇలాంటి నిబంధనలు లేవు. పది, ఇంటర్ మార్కుల పర్సెంటేజ్ ఎందుకో. సివిల్స్‌కు సైతం ఇలాంటి నిబంధనలు లేవు. టీటీసీ అభ్యర్థులకు అర్హత నిబంధనలు వేరుగా, బీఈడీ అభ్యర్థులకు నిబంధలను వేరుగా ఉన్నట్లు తెలుస్తోంది.

– జెన్నే మల్లికార్జున, డీఎస్సీ అభ్యర్థి, ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి, తిరుపతి

ఉద్యమం తప్పదు



గతంలో ఎన్నడూ లేనివిధంగా డీఎస్సీకి లేనిపోని మెలికలు పెట్టడం దారుణం. ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో అర్హతల విషయంలో ఎంతోమంది అభ్యర్థులు అనర్హులుగా మిగిలిపోతారు. కుట్రలో భాగంగానే కండీషన్స్ పెట్టారని అనిపిస్తోంది. టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించిన వారికి విద్యార్హతల మెలిక ఎందుకు పెట్టారో అర్థం కావడంలేదు. గతంలో డీఎస్సీకి ఉన్న అర్హతలే ప్రస్తుత డీఎస్సీకి కొనసాగించాలి. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం.

– భగత్‌రవి, డీఎస్సీ అభ్యర్థి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, తిరుపతి

ఎర్రచందనం కేసులో ఐదేళ్ల జైలు

తిరుపతి లీగల్: ఎర్రచందనం కేసులో చిత్తూరు, గుడుపల్లి, లెనిన్ నగర్‌కు చెందిన సెల్వంకు ఐదేళ్ల జైలు శిక్ష, మూడు లక్షల రూపాయల జరిమానా విధిస్తూ తిరుపతి ఎర్రచందనం కేసుల విచారణ ప్రత్యేక సెషన్స్ జడ్జి నరసింహమూర్తి శుక్రవారం తీర్పుచెప్పారు. కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలకృష్ణమనాయుడు, పోలీస్ సిబ్బంది శివప్రసాద్, శివకుమార్ తెలిపిన వివరాలు.. 2022 అక్టోబర్ 8న తిరుపతి టాస్క్‌ఫోర్స్ సిబ్బంది శేషాచలం రిజర్వ్ ఫారెస్ట్, టీఎన్ పాళ్యం బీట్, తిరుపతి రూరల్ మండలంలో తనిఖీలు నిర్వహిస్తుండగా నిందితుడు సెల్వం మరి కొంతమంది అటవీ ప్రాంతంలో గొడ్డళ్లు, చాకులను తీసుకొని వెళ్తుండగా వారిని విచారించడానికి ప్రయత్నించారు. అయితే నిందితుడు సెల్వం ఫారెస్ట్ సిబ్బందికి పట్టుపడగా మరికొంతమంది పరారయ్యారు. ఫారెస్ట్ సిబ్బంది నిందితుడు సెల్వంను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. నేరం అతనిపై రుజువు కావడంతో న్యాయమూర్తి సెల్వంకు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

మరో కేసులో ఇద్దరికి ఏడాది జైలు

2014 డిసెంబర్ 26వ తేదీ శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, గోన్నుపల్లి సెక్షన్, రాపూర్ వెలుగొండ రిజర్వ్ ఫారెస్ట్, దాసరికోన అటవీ ప్రాంతంలోకి అక్రమంగా ప్రవేశించి 83 కిలోల ఏడు ఎర్రచందనం దుంగలను నరికి తరలిస్తున్న కేసులో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, రాపూరు మండలం, గొన్నుపల్లికి చెందిన చల్ల రమణయ్య, బత్తల రమణయ్యకు ఒక్కొక్కరికీ ఏడాది జైలు శిక్ష, రూ.5 వేలు చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ ప్రత్యేక జూనియర్ జడ్జి కోర్టు జడ్జి ఎస్ శ్రీకాంత్ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ రామ శాంతి వాదించారు.

కాపు అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో డీఎస్సీ పరీక్షలకు శిక్షణ పొందుతున్న కాపు అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ బలిజ, తెలగ, ఒంటరి సామాజిక వర్గాలకు చెందిన అభ్యర్థులు ఈ నెల 28వ తేదీ లోపు www.mdfc.apcfrr.in (డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎండీఎఫ్‌సీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్) వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

పోలీసు కుటుంబానికి ఆర్థిక సాయం



చెక్కు అందజేస్తున్న ఏఎస్పీ

చిత్తూరు అర్బన్: జిల్లా పోలీసుశాఖలో నాలుగో తరగతి ఉద్యోగిగా పనిచేస్తూ ఈనెల 19న మరణించిన శంకరమ్మ కుటుంబానికి రూ.1.50 లక్షల ఆర్థిక సాయాన్ని ఏఎస్పీ రాజశేఖర్‌రాజు శుక్రవారం అందజేశారు. చిత్తూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో మృతురాలి కుమారుడు చంద్రబాబుకు ఐడీఆర్ఎఫ్ నిధుల నుంచి రూ.లక్ష, విడో ఫండ్ నుంచి రూ.50 వేలు, మొత్తం రూ.1.50 లక్షలు చెక్కు రూపంలో అందజేశారు.

అర్హులకు అందుతున్న వ్యవసాయ పరికరాలు

సాక్షి ఎఫెక్ట్..



సరోజమ్మకు స్ప్రేయర్ పంపిణీ చేస్తున్న సిబ్బంది

పలమనేరు: పలమనేరు వ్యవసాయశాఖ డివిజన్‌కు సంబంధించి సబ్సిడీ వ్యవసాయపరికరాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి సంబంధిత వ్యవసాయశాఖ అధికారులు వారు కొరుకున్న పరికరాలను పంపిణీ చేస్తున్నారు. ఆ మేరకు పలు మండలాల్లో శుక్రవారం రైతులకు వీటిని రైతు సేవా కేంద్రాల సిబ్బంది ద్వారా పంపిణీ చేశారు. గత నెల 9వ తేదీన సాక్షి దినపత్రికలో 'తమ్ముళ్లకే యంత్రసాయం' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ అదే రోజు సమావేశం నిర్వహించారు. అర్హులైన వారికి వ్యవసాయ పరికరాలు విధిగా అందించాలని ఏఓలకు సూచించారు. ఇందులో ఎలాంటి రాజకీయాలకు తావులేదని స్పష్టం చేశారు. దీంతో పరికరాల పంపిణీ సజావుగానే సాగుతోంది. ఆ మేరకు పలమనేరు మండలంలోని కల్లాడు సచివాలయంలో సైతం పార్టీలకతీతంగా రైతులకు అవసరమైన పనిముట్లను సిబ్బంది పంపిణీ చేశారు.

బావిలో శవమై తేలిన మహిళ

పూతలపట్టు (కాణిపాకం): పూతలపట్టు మండలంలో అదృశ్యమైన ఓ మహిళా బావిలో శవమై తేలింది. పోలీసుల కథనం మేరకు.. పూతలపట్టు మండలం గాండ్లపల్లికి చెందిన లక్ష్మి(70) అనే మహిళ నాలుగు రోజుల కిందట అదృశ్యమైంది. అప్పటి నుంచి కుటుంబసభ్యులు ఆమె ఆచూకీ కోసం గాలించారు. శుక్రవారం సాయంత్రం గ్రామానికి సమీపంలో ఉండే బావి నుంచి దుర్వాసన వచ్చింది. దీంతో స్థానికులు పూతలపట్టు సీఐకి సమాచారం అందజేశారు. పోలీసులు బావి వద్దకు చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా కాలు జారి పడిపోయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

మూగవేదన..తీరని రోదన

- నేడు వరల్డ్ వెటర్నరీ డే..

చిన్న జబ్బు చేసినా మనం ఆస్పత్రికి ఉరుకులు.. పరుగులు తీస్తాం. మూగ జీవాల పరిస్థితి వేరు. ప్రభుత్వ పశువైద్యశాలలు తప్ప గ్రామాల్లో వీటికి ప్రత్యేక ఆస్పత్రులు లేవు. ఉన్న వైద్యశాలల్లో సిబ్బంది లేరు.. మందులు లేక వెలవెలబోతున్నాయి. దీనికితోడు గత సర్కారు హయాంలో అమలవుతున్న పథకాలు ఆగిపోయాయి. వెరసి మూగవేదన తీరని రోదనగా మారింది. పశువైద్యం గాలిలో దీపం అన్న చందమైంది.



చిత్తూరు మండలంలోని పశుఆరోగ్య కేంద్రం

కాణిపాకం: కూటమి పాలనలో పశువైద్యం పడకేసింది. అత్యవసర సేవలు అటకెక్కాయి. గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో పాడి పరిశ్రమ పరుగులు పెట్టింది. అప్పటి ప్రభుత్వం పాడి వృద్ధి, మెరుగైన పశు వైద్యానికి కృషి చేసింది. పలు పథకాలు అమలు చేస్తూ పాడి రైతులను ప్రోత్సాహించింది. క్షేత్రస్థాయిలో పశువులు, జీవాలకు తక్షణ వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పాడి పథకాలు నీరుగారాయి. వైద్య సేవలు కుంటుపడ్డాయి. క్షేత్రస్థాయిలో పనిచేసే పశు సంవర్థక సహాయకులు సర్వేలకు పరిమితమయ్యారు. దీంతో పల్లెల్లో పశు వైద్యం అందని ద్రాక్షలా మారింది. నేడు వరల్డ్ వెటర్నరీ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

వరల్డ్ వెటర్నరీ డే చరిత్ర...

ఏటా ఏప్రిల్ చివరి శనివారం రోజు వరల్డ్ వెటర్నరీ డే జరుపుకుంటున్నారు. జంతువుల ఆరోగ్యం, సంరక్షణ, జంతు హింసను నిరోధించడానికి తీసుకోవాల్సిన ప్రయత్నాలపై అవగాహన పెంచడమే లక్ష్యంగా ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. అయితే ఇందుకు తగ్గట్టు జిల్లాలో పశు వైద్య సేవలు అమలు కాలేదు.

వేధిస్తున్న సమస్యలివీ..

పశు వైద్యశాలలు, ఆరోగ్య కేంద్రాల్లో పశు వైద్యం మరుగున పడింది. మందుల, మాత్రల కొరత వేధిస్తోంది. డాక్టర్లు విధుల్లో ఉండడం లేదు. చాలా చోట్ల మధ్యాహ్నానికే దుమ్మా కొడుతున్నారు. జిల్లా పశు వైద్యశాలలో టైపిస్ట్ 1, రేడియోగ్రాఫర్ 1, అటెండర్లు -2, వెటర్నరీ అసిస్టెంట్ -1తోపాటు పలు పోస్టులు ఖాళీలున్నాయి. వీటిని భర్తీ చేయడంలో ప్రభుత్వం మీనామేషాలు లెక్కిస్తోంది. అలాగే మండలాల్లోని పశు వైద్య ఆరోగ్య కేంద్రాల్లో కూడా పలు పోస్టులు ఖాళీలున్నాయి. ఇక ఉన్న సిబ్బంది కూడా సర్వేలకు పరిమితమయ్యారు. క్షేత్రస్థాయిలో మూగజీవులు అనారోగ్య బారిన పడితే ప్రైవేటు వైద్యులే దిక్కుగా మారుతున్నారు. ఈ కారణంగా పశు వైద్యం మూగబోయి మూగజీవులు మృత్యువాత పడుతున్నాయి.

గత ఐదేళ్ల పాలనలో..

గత ఐదేళ్ల పాలనలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పశు వైద్య సేవలకు ప్రాధాన్యత ఇచ్చింది. రైతు భరోసా కేంద్రాల ద్వారా పలు పథకాలను అమలు చేసింది. మెరుగైన వైద్యం అందిస్తూ వచ్చింది.

- పశుసంవర్థక సహాయకుల నియామకం.
- వైఎస్సార్ పశునష్ట పరిహారం..ఉచిత బీమా
- పశు హెల్త్ కార్డులు
- వైఎస్సార్ చేయూత ద్వారా పశువుల కొనుగోలు
- 1962 నంబర్‌కు ఫోన్ చేస్తే వైఎస్సార్ సంచార పశు ఆరోగ్యసేవలు
- రాయితీ ద్వారా పశువులకు అవసరమైన మొక్క జొన్నలు, చాఫ్‌కటర్, మినరల్ మిక్చర్, పశువుల దాణా సరఫరా.
- సీజనల్ వ్యాధుల కట్టడికి ముందస్తు చర్యలు. పశువులు, జీవాలకు టీకాలు, పురుగుల మందులు పంపిణీ.
- వారానికొకసారి రైతులతో పశు సంవర్థక అవగాహన కార్యక్రమాలు, వైద్య శిబిరాలు.
- గ్రామంలో బల్క్‌మిల్క్ సెంటర్‌లు ఏర్పాటు
- చిత్తూరు నగరంలో మూతపడిన విజయ డెయిరీకి పునర్జీవనం పోసింది. అమూల్ డెయిరీకి అప్పగించి, అభివృద్ధిలోకి తీసుకొచ్చింది. ఈ ఫలితంగా జిల్లాలో పాడి పరిశ్రమ పుంజుకుంది. చాలా మంది ఇతరాత్ర పనులను వదిలి పాడి ఆవులతో పాల ఉత్పత్తిని పెంచుకుంటూ జీవనం చేసేందుకు అడుగులు వేశారు.

ప్రస్తుత ప్రభుత్వ పాలనలో..

- పశు సంచార పశు ఆరోగ్య సేవలు ఆపివేసింది.
- అవగాహన కార్యక్రమాలు, వైద్య శిబిరాలు జరగడం లేదు.
- రాయితీ పాడి పరికరాల అందజేతకు స్వస్తి పలికింది.
- బల్క్ మిల్క్ సెంటర్లను మూయించింది.
- మందులు, మాత్రల కొరత వేధిస్తోంది.
- ఉచిత బీమాకు, పశు నష్ట పరిహారానికి మంగళం పాడింది.

జిల్లా సమాచారం..

జిల్లా పశువుల ఆస్పత్రి -	1
ఏరియా పశు వైద్యశాలలు -	14
వెటర్నరీ డిస్పెన్సరీ వైద్యశాలలు -	68
రూరల్ లైఫ్‌స్టాక్ యూనిట్లు -	75
రైతు భరోసా కేంద్రాలు -	297
పాడి ఆవులు -	4,67,507,
గేదెలు -	1,036
మేకలు -	13,80,063
గొర్రెలు -	4,38,362
పందులు -	359
కుక్కలు, కోళ్లు -	5,08,808

చాఫ్‌కటర్ పంపిణీ వివరాలు..

2021-22	670
2022-23	365
2023-24	1800
మొత్తం	2,835

పశువైద్యానికి ఇబ్బందిగా ఉంది



ముందు పశువైద్యానికి ఎలాంటి ఢోకా ఉండేది కాదు. ఫోన్ చేస్తే ఎక్కడున్న వైద్య సిబ్బంది వచ్చి వైద్యం చేస్తున్నారు. టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే బండి ఇంటికాడికి వచ్చేది. ఇప్పుడు పశువులకు వైద్యం చేయించడానికి చాలా ఇబ్బంది పడుతున్నాం. ఇప్పుడు సిబ్బందికి ఫోన్ చేస్తే సర్వేలంటున్నారు. వాళ్లకు కూడా సర్వేలు ఇస్తే మూగ జీవాలు ఏమైపోవాలి. వారి సేవలు గ్రామాల్లో అవసరం. మనిషికి ఏ రకంగా తక్షణ వైద్యం అవసరమో..ఆ రకంగా జీవాలకు తక్షణ వైద్యం అవసరం. అధికారులు దీని నిగుర్తించాలి.

– రాజేంద్ర, శ్రీరంగరాజపురం

డైయింగ్ ప్లాంట్లు తరలించాల్సిందే!

- అజెండా తీర్మానం వాయిదా
- మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన



మున్సిపల్ కమిషనర్‌తో కౌన్సిలర్ల వాగ్వివాదం



మున్సిపల్ కార్యాలయం ముందు కౌన్సిలర్ల నిరసన

నగరి: నగరి మున్సిపల్ సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు మిషన్ డైయింగ్, మాన్యువల్ డైయింగ్ యూనిట్లు ఏదైనా సరే ఊరిలో ఉండకూడదు దూరంగా నివాసేతర ప్రాంతాలకు తరలించాల్సిందేనంటూ అజెండా తీర్మానం వాయిదా వేసి రోడ్డెక్కారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్, పొల్యూషన్ బోర్డు అధికారుల వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసన చేపట్టారు. మున్సిపల్ కౌన్సిల్ హాలులో చైర్మన్ పీజీ నీలమేఘం అధ్యక్షతన మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి మున్సిపల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అయితే అధికారులు పొందుపరచిన అజెండాను వినడానికి కూడా తాము సంసిద్ధంగా లేమని డైయింగ్ యూనిట్ల పొల్యూషన్ సమస్య పరిష్కారం అయిన తరువాతే అజెండాలోని అంశాలు వింటామని అధికారులకు స్పష్టం చేశారు. దీనిపై కమిషనర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ డైయింగ్ యూనిట్లపై చర్యలు తీసుకోవాల్సింది పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మాత్రమేనని వారు ఆరు యూనిట్లు సక్రమంగా ఉన్నాయంటూ కార్యాలయానికి లేఖ అందిందన్నారు. దీనిపై వైస్ చైర్మన్లు వెంకటరత్నంరెడ్డి, బాలన్‌తో పాటు కౌన్సిలర్లు బీడీ భాస్కర్, దయానిధి, ఇంద్రయ్య, కోఆప్షన్ సభ్యులు ఎల్లప్పరెడ్డి మాట్లాడుతూ సక్రమంగా ఉందంటే అది ఏ ఆధారంగా తేల్చారన్నారు. గతంలో ఏ ప్లాంటు సక్రమంగా నిర్వహించడం లేదని మున్సిపల్ అధికారులు స్పష్టం చేస్తే, నేడు బాగుందని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు తెలపడం విడ్డూరంగా ఉందన్నారు. అన్ని ప్లాంట్లు మూసే అధికారం మీకు లేకుంటే చేతులెత్తేయండి ఉన్నతాధికారుల వద్దకు వెళ్లి నిరసన వ్యక్తం చేస్తామంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సిలర్ మోహన్‌రాజ్ మాట్లాడుతూ 16 డైయింగ్ యూనిట్లు ఉంటే అందులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వారి ప్లాంట్లకు మాత్రమే సీల్ వేశారన్నారు. అన్ని డైయింగ్ యూనిట్లు మూసి వేస్తామని అధికారులు చెబుతున్నారని, అయితే టీడీపీకి చెందిన కొన్ని మిషన్ డైయింగ్, మాన్యువల్ డైయింగ్ యూనిట్లు నిర్వహణలో ఉన్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ వారి ప్లాంటు నుంచి విషం వస్తే టీడీపీ ప్లాంటు నుంచి అమృతం వస్తుందా? అంటూ అధికారులను నిలదీశారు. ప్లాంటు ఏదైనా మూసివేయాల్సిందే ఊరికి దూరంగా వెళ్లాల్సిందే అన్నారు. దీంతో కౌన్సిలర్లు అందరూ ఏకీభవించారు. ఓ దశలో సమావేశాన్ని బాయ్‌కాట్ చేయడానికి కౌన్సిల్ సిద్ధమైంది. దీనిపై చైర్మన్ పీజీ నీలమేఘం మాట్లాడుతూ పాలకవర్గంగా ఉన్నవారే బాయ్‌కాట్ చేయడం సబబుకాదన్నారు. డీఈ మాట్లాడుతూ కౌన్సిలర్లు హాజరైనట్లు రికార్డు ఉంటేనే గౌరవ వేతనం కూడా వస్తుందన్నారు. దీనిపై కౌన్సిలర్లు మాట్లాడుతూ కౌన్సిలర్ల మాటలకు గౌరవమే లేనపుడు గౌరవ వేతనం ఎందుకని ప్రజల బాగు కోసం వేతనం వదులుకోవడానికి కూడా తాము సిద్ధమన్నారు. పోరాటానికి తాను కూడా సిద్ధమేనని, అయితే పద్ధతి ప్రకారం పోరాడుదామని చైర్మన్ తెలపడంతో కౌన్సిలర్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ డైయింగ్ ప్లాంట్లను తరలించే వరకు సమావేశం జరిగినా ఏ అంశానికి కౌన్సిల్ ఆమోదం ఉండదని వాయిదా తీర్మానాలే వేయాలని ఇందుకు సమ్మతమా? అని ప్రశ్నించారు. దీనిపై అందరూ ఏకీభవించడంతో హాజరు పట్టికలో మాత్రమే సంతకాలు చేసి తీర్మానాలు వాయిదా వేసిన కౌన్సిల్ సమావేశం నుంచి బయటకు వచ్చి రోడ్డెక్కింది. మున్సిపల్ కార్యాలయం ఎదుట నిలబడి నిరసన వ్యక్తం చేసింది. డైయింగ్ ప్లాంట్లను దూరప్రాంతాలకు తరలించడమే మా ప్రధాన అజెండా అని, అది నెరవేరేంతవరకు ఏ అజెండాలకు ఆమోదం లేదంటూ స్పష్టం చేసింది.

వైభవంగా ఉరుసు ప్రారంభం



పుంగనూరులో నూర్‌షావలి దర్గాలో ప్రార్థనలు చేస్తున్న మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

- చాదర్ బహూకరించిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి
- ప్రార్థనలో పాల్గొన్న వేలాది మంది ముస్లింలు

పుంగనూరు: పట్టణంలోని చెరువు కట్టపై ఉన్న హాజరత్ సయ్యద్‌నూర్‌షావలిబాబా ఉరుసు ఉత్సవం శుక్రవారం గంధంతో వైభవంగా ప్రారంభమైంది. రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముస్లిం వేషధారణలో చాదర్‌ను నెత్తిన పెట్టుకుని ర్యాలీగా వచ్చి దర్గాలో బహూకరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కాగా 27వ తేదీన ఖవ్వాలి, 28న తహలీల్ ఫాతేహా నిర్వహిస్తారు. ఈ మేరకు దర్గాను విద్యుత్ దీపాలతో అలంకరించారు. దర్గాలో ప్రత్యేక పూలు చాదర్‌లు పెట్టి హాజరత్‌లు పూజలు చేశారు. స్థానిక ఎన్ఎస్. పేటలోని కళాశాల మైదానంలో ఉరుసు సందర్భంగా దుకాణాలు, రంగుల రాట్నాలు ఏర్పాటు చేశారు. ఉరుసు కార్యక్రమానికి వేలాది మంది ముస్లిం, హిందువులు రానుండటంతో దర్గా కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉరుసు కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో అన్నదానం ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, కమిషనర్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు పారిశుద్ధ్య కార్యక్రమాలు, మంచినీరు, వైద్య సేవలతో పాటు విద్యుత్ అంతరాయం కలగకుండ ఏర్పాట్లు చేపట్టారు. అలాగే పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ ఆధ్వర్యంలో సీఐ సుబ్బరాయుడు, ఎస్ఐలు లోకేష్, కేవీ రమణ, సిబ్బంది కలసి ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు.

మూడు టిప్పర్ల సీజ్.. నలుగురి అరెస్టు

నగరి: తమిళనాడుకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు టిప్పర్లను సీజ్ చేసి, నలుగురిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. డీఎస్పీ, సీఐల కథనం మేరకు.. దామరపాకం రెవెన్యూ పరిధి నుంచి ఇతర రాష్ట్రాలకు ఇసుక అక్రమ రవాణాపై పోలీసులకు సమాచారం అందింది. దీంతో శుక్రవారం వేకువజామున కుశస్థలి నది నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమం డంప్ చేసి, జేసీబీలతో టిప్పర్లకు లోడ్ చేస్తుండగా రెడ్‌హేండెండ్‌గా పట్టుకున్నారు. మూడు టిప్పర్లలోని 50 యూనిట్ల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో నగరి మున్సిపాలిటీలోని కాకవేడుకు చెందిన ఎస్.ఉస్మాన్ (23), తమిళనాడు తిరుత్తణి శ్రీనివాసపురానికి చెందిన ఆర్. శరవణ (47), మురకంబట్టుకు చెందిన ఎం.గోపి(40), విజయపురం మండలం కేవీ శ్రీరామపురం గ్రామ వాసి పి.మధు (32)ను అరెస్టు చేసినట్లు డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్, సీఐ విక్రమ్ తెలిపారు. విచారణలో నగరికి చెందిన బిలాల్, షేక్, ఉస్మాన్‌లు, విజయపురం మండలం తిరుమల నాయుడు కండ్రిగకు చెందిన ఉమాపతి అతని అనుచరులు ఒక గ్రూప్‌గా ఏర్పడి తమిళనాడుకు చెందిన కొంత మంది ఇసుక అక్రమ రవాణాదారులతో చేతులు కలిపి, విజయపురం, నగరి మండలాల్లో కుశస్థలి నది నుంచి టిప్పర్లలో తమిళనాడుకు రవాణా చేస్తున్నారన్నారు. ఈ కేసులో ప్రధాన ముద్దాయిల ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు.

కర్ణాటకలో శవమై తేలిన కుప్పం మహిళ



రాజేశ్వరి (ఫైల్)

కుప్పంరూరల్: భార్య ఆస్తిపై కన్నేసిన భర్త 2021లో బావమరిదిని, తాజాగా భార్యను చంపి శవాన్ని అడవిలో పడేసి తన క్రూరత్వాన్ని చాటుకున్నాడు. రెండు వారాల కిందట హత్యకు గురైన మహిళ మృతదేహాన్ని శుక్రవారం కర్ణాటక పోలీసులు వెలికి తీశారు. వివరాల్లోకి వెలితే..కుప్పం మండలం, చీగలపల్లి గ్రామానికి చెందిన వికలాంగుడు వెంకటేష్, చిన్నపాప దంపతులకు రాజేశ్వరి, వెంకటాచలం పిల్లలు ఉన్నారు. కుమార్తె రాజేశ్వరిని పదేళ్ల కిందట కర్ణాటక రాష్ట్రం బంగారుపేట తాలూకా పాతరామగోలు గ్రామానికి చెందిన రాఘవేంద్రకు ఇచ్చి వివాహం చేశాడు. మొదట్లో వారి కాపురం సజావుగా సాగింది. వారికి ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. 2021 ఉగాది పండుగ సందర్భంగా వెంకటేష్ తన కుమార్తె రాజేశ్వరిని కుటుంబ సమేతంగా చీగలపల్లెకు రావాలని ఆహ్వానించాడు. తండ్రి కోరిక మేరకు రాజేశ్వరి తన భర్త రాఘవేంద్ర, ఇద్దరు పిల్లలతో కలిసి పుట్టింటికి వచ్చింది. అప్పటికే కొంత ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్న రాఘవేంద్ర పండుగ పూట మామ వెంకటేష్‌ను కొంత డబ్బు ఇవ్వమని అడిగాడు. తమ వద్ద లేదని వెంకటేష్ తిరస్కరించాడు. ఆస్తి అమ్మి అమ్మి అయినా ఇవ్వాలని గొడవకు దిగాడు. తనకు 3 ఎకరాల ఆస్తి మాత్రమే ఉందని, దాన్ని తన కొడుకు వెంకటాచలానికి ఇవ్వాలని, అమ్మడం కుదరదని తెగేసి చెప్పాడు. దీంతో రాఘవేంద్ర వెంకటాచలంపై కసి పెంచుకుని, జనసంచారం లేని ప్రదేశానికి తీసుకెళ్లి హత్య చేశాడు. మృతదేహాన్ని గ్రామానికి సమీపంలోని రోడ్డుపై పడేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరణకు ప్రయత్నించాడు. బిడ్డ మృతిపై వెంకటేష్ కుప్పం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోలీసులు అనుమానితుడైన రాఘవేంద్రను అరెస్టు చేసి, విచారణ జరపగా హత్య చేసినట్లు అంగీకరించాడు. దీంతో హతుడు రాఘవేంద్ర జైలుకు వెళ్లాడు. అప్పటి నుంచి రాజేశ్వరి తన ఇద్దరి పిల్లలతో స్వగ్రామం చీగలపల్లిలోనే ఉండిపోయింది. నిత్యం బెంగళూరుకు రాకపోకలు సాగిస్తూ తల్లిదండ్రులు, పిల్లలను పోషిస్తోంది.

తాజా భార్య రాజేశ్వరి..

ఏడాది తరువాత జైలు నుంచి బయటికి వచ్చిన రాఘవేంద్ర ఎలాగైనా భార్యను హతమార్చి ఆస్తి కాజేయాలని కసిపెంచుకున్నాడు. ఈ క్రమంలో మూడు నెలలుగా భార్య రాజేశ్వరితో తాను మారిపోయానని నమ్మబలికి కుటుంబ సభ్యులకు తెలియకుండా ఫోన్లలో మాట్లాడుతున్నాడు. దీంతో రాజేశ్వరి భర్తను నమ్మింది. ఈ క్రమంలో ఏప్రిల్ 11న రాజేశ్వరి ఉదయం లేచి కూలీ పనులకు బెంగళూరుకు బయలుదేరింది. భర్త బంగారుపేటలో దిగమని ఆదేశించడంతో రాజేశ్వరి బంగారుపేటలో దిగింది. భర్తతో కలిసి పాతరామగోలు అటవీ ప్రాంతానికి వెళ్లారు. వారం రోజులు గడిచిన బెంగళూరు వెళ్లిన రాజేశ్వరి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు వెంకటేష్, చిన్నపాప దంపతులు కుప్పం పోలీసులను ఆశ్రయిస్తారు. పోలీసులు కేసు నమోదు చేసి రాజేశ్వరి కాల్‌డేటాను పరిశీలించగా, అందులో భర్త రాఘవేంద్రతో మాట్లాడినట్లు నిర్ధారించుకున్నారు. బూదికోట పోలీసుల సహకారంతో భర్త రాఘవేంద్రను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా, రాజేశ్వరిని తాను హత్య చేసినట్లు అంగీకరించాడు. శుక్రవారం కర్ణాటక పోలీసులు అడవిలో కుళ్లిపోయిన రాజేశ్వరి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం బంగారుపేటకు తరలించి బంధువులు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న ఇద్దరు పిల్లలు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. రాజేశ్వరి హత్య, పిల్లల రోదన చూసి చీగలపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.


గోల్డ్ కుంభకోణంలో కీలక నిందితుడి అరెస్టు



కీలక నిందితుడిని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్న దృశ్యం

పలమనేరు: పలమనేరు, పుంగనూరు నియోజకవర్గాల్లో కనకదుర్గ గోల్డ్ ఫైనాన్స్ బ్యాంకులో బంగారు ఆభరణాల మోసం కేసుకు సంబంధించిన కుంభకోణంలో అసలు నిందితుడిని పలమనేరు పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. పలమనేరు, పుంగనూరు ప్రాంతాల్లో గత కొన్నేళ్లుగా కనకదుర్గ ఫైనాన్స్ పేరిట బ్యాంకులు ఏర్పాటు చేశారు. ఇందులో పని చేస్తున్న అధికారులు, సిబ్బంది కలసి బంగారు నగల విషయంలో అక్రమాలు జరిగి రూ.కోట్లలో మోసాలు జరిగాయి. దీనిపై సాక్షి దినపత్రికలో పలు కథనాలు వెలువడ్డాయి. కాగా దీనిపై స్థానిక పోలీసుల పెద్దగా పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో ఈ కుంభకోణంలో ప్రధాన నిందితుడైన నరసింహులు న్యాయవాదుల ఆధ్వర్యంలో పలమనేరులోని కోర్టులో లొంగిపోయారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు నిందితుడిని విచారించేందుకు పిటిషన్ వేసి అదుపులోకి తీసుకున్నారు. దీనిపై విచారణ చేసి ఈ కుంభకోణంలో మొత్తం నిందితులను త్వరలో అరెస్టు చేస్తామని సీఐ నరసింహరాజు తెలిపారు. ఇలా ఉండగా స్థానిక పోలీసులు నిందితుడిని స్థానిక పోలీస్ స్టేషన్ వద్దకు తీసుకెళుతుండగా బాధితులు పెద్ద సంఖ్యలో నిందితుని పై దాటికి ప్రయత్నం చేయడం గమనార్హం. దీనిపై స్థానిక సీఐ నరసింహరాజును వివరణ కోరగా కనకదుర్గ ఫైనాన్స్ కుంభకోణంలో కీలక నిందితుడిని కోర్టు ద్వారా విచారణకు తీసుకున్న విషయం నిజమేనని, దీనిపై పూర్తి విచారణ పూర్తి చేశాక వివరాలను తెలుపుతామని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



ముత్తు(ఫైల్)

కుప్పంరూరల్: మండలంలోని ఇంజినీరింగ్ కళాశాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వెండుగంపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి మృతి చెందినట్లు కుప్పం పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. కుప్పం మండలం వెండుగంపల్లి గ్రామానికి చెందిన ఎం.ముత్తు తన స్నేహితుడు శేఖర్‌తో కలిసి కూలీ పనుల కోసం మల్లానూరు గ్రామానికి బయలుదేరాడు. శేఖర్ ద్విచక్ర వాహనం నడుపుతుండగా, మార్గం మధ్యలోని ఇంజినీరింగ్ కళాశాల వద్దకు చేరుకోగానే స్పీడ్ బ్రేకర్ల వద్ద ద్విచక్ర వాహనం బ్రేక్ కొట్టడంతో వెనుక వైపు కూర్చున్న ఎం.ముత్తు (28) అదుపు తప్పి ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను ఢీ కొన్నాడు. ప్రమాదంలో శేఖర్ సురక్షితంగా బయటపడగా, ఎం.ముత్తు అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారమందుకున్న పోలీసులు టిప్పర్ డ్రైవర్ బాలక్రిష్ణను అదుపులోకి తీసుకుని, ముత్తు మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. కాగా, మృతుడు ఎం.ముత్తుకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

జారిపడి వ్యక్తి మృతి

చిత్తూరు అర్బన్: తాగి ఇంట్లో జారి పడిన వ్యక్తి తలకు తీవ్రగాయాలై మృతి చెందిన ఘటన శుక్రవారం చిత్తూరు నగరంలోని చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. యాదమరి మండలం ముత్తురామాపురానికి చెందిన తులసికుమార్(40) అనే వ్యక్తి న్యూ బాలాజీ కాలనీలో నివాసిస్తున్నాడు. భార్య ఊరెళ్లడంతో తులసికుమార్ మద్యం సేవించి తూగుతూ ఇంటికి వెళ్లాడు. ఇంటికి వెళ్లిన వ్యక్తి టైల్స్‌పై జారి పడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలంలోనే మృతి చెందడంతో భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని టూటౌన్ ఎస్ఐ బలరామయ్య తెలిపారు. కాగా ఇతనికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.